కథ

# నిర్ణయం

డా.సి.ఎం.అనూరాధ

"నీ నిర్ణయం ఇదేనా! ఇక మార్చుకోవా"! భర్త రవీంద్ర మాటలకు ఏం చెప్పాలో అర్థంకాక మౌనంగా ఉండిపోయింది స్వప్న. ఇలా అడిగితే తనేం చెప్పగలదు? ఎటూ నిర్ణయించుకోలేక మనసు కల్లోలంగా ఉంది.

"సరే! అలా అయితే నా నిర్ణయం కూడా చెప్తున్నా, విను! నీవు నీ తల్లిదండ్రులని బయటకు పంపించకపోతే నా జీవితం నుంచి శాశ్వతంగా తప్పుకోవలసి ఉంటుంది. వాళ్లా నేనా, ఎవరో ఒక్కరే ఇక్కడ ఉండాలి. సాయంత్రంలోగా నిర్ణయించుకో. ఇదిగో డైవోర్స్ అప్లికేషన్ కూడా తెచ్చాను. నీ నిర్ణయం మార్చుకుంటే వీటి అవసరం ఉండదు" డైవోర్స్ అప్లికేషన్ మంచం మీదకు గిరాటేసి వెళ్లిపోయాడు రవీంద్ర.

★ ★ ★


గత కొద్ది రోజులుగా, స్వప్న, రవీంద్రల మధ్య ఈ ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. స్వప్న తన తల్లిదండ్రులను రెండు రోజుల క్రితం ఇక్కడికి తీసుకొచ్చింది. అప్పటి నుంచి ఇదే గొడవ. స్వప్న తండ్రి రఘురామయ్య రిటైరయిన టీచరు. తల్లి జానకమ్మ. ఆ దంపతులకు ముగ్గురూ కూతుళ్లే. తన శక్తికి మించి పిల్లలు ముగ్గురినీ చదివించి తగిన వరుళ్లను వెదికి పెళ్లి చేశారు. రిటైరయి ఇరవై ఏళ్లు కావస్తున్నా ఎవరి మీదా ఆధారపడకుండా సొంత ఊళ్లోనే కాలం గడుపుతున్నారు. ఏ కూతురయినా అవసరమని ఫోన్ చేస్తే వారింటికెళ్లి ఓ నాలుగు రోజులు ఉండి రావడం తప్ప ఎవరింట్లోనూ ఎక్కువ రోజులు ఉండేవారు కాదు. ఈమధ్య ఇద్దరికీ వయసు బాగా పైబడడం, దానికి తోడు చికన్‌గున్యా ఎటాక్ కావడం మూలాన వారికి ఓ మనిషి అవసరం తప్పనిసరి అయింది. స్వప్న పది రోజుల క్రితం ఊరెళ్లినప్పుడు తల్లిదండ్రుల పరిస్థితి చూసి కరిగిపోయింది. వంట కూడా చేసుకోలేక, చూసేవారు లేక దయనీయ పరిస్థితిలో ఉన్నారు. అక్కలిద్దరికీ ఫోన్ చేసి విషయం తెలియజేసింది. వాళ్లిద్దరూ ఏవో సాకులు చెప్పి చూడడానికి కూడా రాలేదు. వస్తే వాళ్ల బాధ్యత తీసుకోవలసి వస్తుందేమోనన్న భయంతో. ఇక తన పరిస్థితి తనకు తెలుసు. తన భర్త, అత్తగారు అమ్మానాన్నలని అక్కడికి తీసుకెళ్లడానికి ఏమాత్రం అంగీకరించరు. బహుశా తన అక్కావాళ్ల సిట్యుయేషన్ కూడా ఇదే కావచ్చు. అలా అని వాళ్లని అందరు కూతుళ్లా అలా వదిలేస్తే వాళ్లనెవరు చూసుకుంటారు! అసలు వాళ్లనలా చూస్తుంటేనే హృదయం ద్రవించిపోతోంది. అలా వదిలేసి రావడానికి ఎంతమాత్రం మనసొప్పలేదు. అందువల్ల తనతో పాటు ఇక్కడ వైజాగ్‌లో తమింటికి తీసుకొచ్చింది. ఆ ఇల్లు తనకు ఆఫీస్ వాళ్లిచ్చిన క్వార్టర్స్ పెద్దదిగా, ఎంత మంది ఉన్నా ఇబ్బంది లేకుండా కన్వీనియంట్‌గా ఉంది. ఈ విషయమే రవికి కోపం తెప్పించింది. "మీ అక్కలిద్దరూ తెలివిగా ఏదో చెప్పి తప్పించుకున్నప్పుడు నీవుమాత్రం పెద్ద సంఘ సంస్కర్తలా వాళ్లని వెంటేసుకొచ్చావ్! అయినా చెప్తున్నా విను! నా పేరెంట్స్‌ని చూసుకోవడం వరకే నీ బాధ్యత. మీ అమ్మానాన్నలు ఏదో నాలుగు రోజులుండి వెళ్తావుంటే ఓకే.. అంతేగానీ జీవితాంతం ఇక్కడ ఉండటానికి నేనొప్పుకోను. నా సంగతి తెలుసుగా! ఆరు నూరయినా, నూరు ఆరయినా ఈ ఇంట్లో నేను చెప్పింది జరిగి తీరాలి" రవీంద్ర తన తల్లిదండ్రులని తీసుకురావడం పట్ల పూర్తిగా వ్యతిరేకత చూపిస్తున్నాడు.

★ ★ ★

స్వప్న మనసు బాధతో విలవిల్లాడిపోయింది. భర్త సంగతి తెలిసిందే అయినా మరీ ఇంత కఠినంగా మాట్లాడుతాడనుకోలేదు. చివరి ప్రయత్నంగా అత్తగారిని బ్రతిమలాడింది. కనీసం వృద్ధురాలు కనుక, ఆమైనా సాటి ముసలివాళ్లుగా తన అమ్మానాన్నల గురించి కాస్త జాలి చూపిస్తుందేమోనని. ఆమె కాస్త కూడా అటూ ఇటూ పోకుండా కొడుకు మాటలనే రిపీట్ చేసింది. "చేతకానప్పుడు ఎవరినైనా పెట్టుకుని చేయించుకోవాలి గానీ ఇలా కూతురి ఇంట్లో ఎవరైనా వచ్చి ఉంటారా" అంటూ ఎద్దేవా చేసింది. స్వప్న నిశ్చేష్టగా నిలబడిపోయింది. సమయం ఒంటి గంటవుతోంది. అందరికీ భోజనాలు వడ్డించి తను భోజనం కూడా చేయబుద్ధి కాక అలాగే ఆలోచిస్తూ పడుకుంది. కరిగిపోయిన గతాన్ని నిశ్శబ్దం ఆవిష్కరించుకుంటోంది.

చిన్నతనం నుంచీ తమని ఎంతో గారాబంగా పెంచారు అమ్మానాన్నలు. ఊళ్లోవాళ్లు, బంధువులూ అంతా ఆడపిల్లలని హేళన చేసినా ఏ రోజూ బాధపడలేదు నాన్నగారు. పిల్లలని ప్రాణప్రదంగా చూసుకునేవారు. వాళ్లకి ఏ కాస్త జ్వరము వచ్చినా, నలతగా ఉన్నా విలవిల్లాడిపోయేవారు. పిల్లలంతా బాగా చదువుకోవాలని ఆరాటపడేవారు. ఆ రోజుల్లో తమ పల్లెటూళ్లో స్కూల్ మాత్రమే ఉండేది. టెన్త్‌క్లాస్ దాటితే పొరుగూరికి వెళ్లాలి. పొరుగూరికి బస్‌లో వెళ్లి రావడం కష్టమని తమ ముగ్గురినీ హాస్టల్‌లో ఉంచి చదివించారు నాన్నగారు. ఆయన ఆర్థిక పరిస్థితికి ముగ్గురు పిల్లలకి హాస్టల్ ఫీజులు కడుతూ చదివించడం శక్తికి మించిన పనే అయినా తమ ముగ్గురినీ ప్రొఫెషనల్ కోర్సులు చదివించారు. చిన్న బడిపంతులు ఉద్యోగం చేస్తూ పిల్లల్ని అంత బాగా చదివించినవారు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఎవరూ ఉండేవారు కాదు. ఈయన తప్ప. అక్కడికీ ఊళ్లో పెద్దవాళ్లు చెప్పబోయే వారు. "ఆడపిల్లలు కదయ్యా! అంతంత డబ్బులు పోసి చదివించడం దండగ కదా! ఎంత చదివించినా వాళ్లని రేప్పొద్దున ఓ అయ్య చేతిలో పెట్టవలసిందే కదా! వీళ్లు నీవు చెమటోడ్చి సంపాదించిన డబ్బులతో చదువుకుని రేపు వాళ్ల మొగుళ్లకు సంపాదించి పెట్టేవాళ్లే గానీ మనకు పెట్టరు కదా! వీళ్లను చదివించే కొద్దీ వీళ్ల కంటే బాగా చదివిన వాళ్లను వెదికి పెళ్లి చేయాలి. కట్నాలు, కానుకలు దండిగా ఇవ్వాలి. ఎందుకొచ్చిన శ్రమ, ఏ ఇంటరో, డిగ్రీనో చదివించి పెళ్లి చేస్తే పోదా" అంటూ, నాన్నగారు వాళ్లకి సున్నితంగానే సమాధానం చెప్పి పంపేవారు. "వాళ్లు మనకు సంపాదించి పెట్టాలని మనం అనుకోకూడదండీ! మన పిల్లలకు మనం ఇవ్వగలిగిన గొప్ప ఆస్తి చదువు మాత్రమే. మాకు ఆడపిల్లలయినా, మగపిల్లలయినా వాళ్లే కదా! ఏదో ఆ భగవంతుడు వాళ్లకి మంచి తెలివితేటలు ఇచ్చాడు కనుక నేను చదివించగలుగుతున్నాను. ఈ చదువు రేపు జీవితంలో ఏ రకంగానైనా వాళ్లకి ఉపయోగపడవచ్చు" అంటూ.

తాము ఎన్ని ఇబ్బందులు పడుతున్నా పిల్లలని మాత్రం దేనికీ లోటు లేకుండా పెంచారు అమ్మా, నాన్న. తనకింకా బాగా గుర్తుంది. అప్పుడు ఎయిత్ స్టాండర్డ్ చదువుతోంది. తెల్లవారితే తన బర్త్‌డే. ఏ పండగకి కొన్నా, కొనకున్నా, తమ బర్త్‌డేలకు మాత్రం కొత్త డ్రెస్ తెచ్చి ఘనంగా జరిపే వాళ్లు అమ్మా, నాన్న. ఆ రోజు ఉదయం తనని పిలిచి "డబ్బుతో బాగా ఇబ్బందిగా ఉందమ్మా! ఈ బర్త్‌డేకు డ్రెస్ తీసుకురాలేను" అంటూ బాధ పడ్డారు. "ఫరవాలేదు నాన్నగారూ! మొన్న ఉగాదికి కొన్న డ్రెస్ ఉందిగా! అది రెండుసార్లే వేసుకున్నా. అదే వేసుకుంటానులే" అని ఓదార్చింది తను నాన్న బాధపడడం చూళ్లేక. అయితే మనసులో అనుకుంది "కొత్త డ్రెస్ లేకుండా జరుపుకునే మొట్టమొదటి బర్త్ డే ఇది" అని. ఆరోజు స్కూల్



వదిలిన తర్వాత ఈవినింగ్ వాక్‌కని వెళ్లిన నాన్న గారు రాత్రి తొమ్మిది కావస్తున్నా ఇంటికి రాలేదు. అందరం కంగారు పడుతున్నాం. ఇంతలో నాన్న వచ్చారు చేతిలో ప్యాకెట్‌తో సహా. "ఇంత లేటయిం దేంటి నాన్నా"! అందరం ఒక్కసారి చుట్టుముట్టాం. "నాన్నని కాళ్లయినా కడుక్కోనివ్వకుండా అలా చుట్టు కుంటారేమిట్రా" నానమ్మ విసుక్కుంది. "కోప్పడ కమ్మా పిల్లల్ని" అంటూ బామ్మకు సర్దిచెప్పి "ఒరే చిన్నీ! నీ బర్త్‌డేకు డ్రెస్ తీసుకొచ్చాను చూడు" అంటూ ప్యాక్ ఓపెన్ చేశారు. అందులో తనకిష్టమైన పింక్ కలర్ పరికిణీ, పింక్ బ్లౌజ్ మెటీరియల్ ఉంది. పింక్ కలర్ పరికిణీ మీద వెన్నముద్దల్లాంటి తెల్లని జరీపూలు. ఎంతో బ్యూటీఫుల్‌గా ఉందా డ్రెస్. తాముండే ఊళ్లో బట్టలషాపులుండేవి కాదు. ఏం కొన్నాలన్నా పొరుగూరికి వెళ్లాల్సిందే. అంచేత నాన్నగారికి అంత లేట యింది. డ్రెస్ నచ్చిం దని చెప్పగానే తనను తీసు కొని టైలర్ దగ్గరకెళ్లి ఉద యానికంతా డ్రెస్ కుట్టివ్వ మని చెప్పి వచ్చిన తర్వాత గానీ భోంచేయలే దాయన. పడు కునే ముందు అన్నారు" నాకిప్పుడు తృప్తిగా ఉందిరా! నీ బర్త్ డేకి డ్రెస్ తేగలిగాను." ఉద యాన్నే తలంటు పోసుకొని కొత్త డ్రెస్ వేసుకుని అమ్మానా న్నల పాదాలకు నమస్కరించింది. జన్మజన్మలకీ వీళ్లనే తన తల్లిదండ్రు లుగా ఇవ్వమని భగవంతున్ని వేడు కుంది. నాన్న తనని ఆశీర్వదించేట పుడు గమనించింది. చేతికి అందంగా మెరుస్తూ కనిపించే తెల్లరాయి ఉంగరం కనిపించలేదు. "నాన్నగారూ! మీ రింగ్" తన మాట సగంలో ఉండగానే చెప్పారు. అది టైట్ అయిందని తీసి పెట్టానురా అని, తర్వాత తెలిసింది. నాన్న ఆ రింగ్‌ని తన బర్త్‌డే డ్రెస్ కొనడానికి అమ్మివేశారని. నాన్న అంత కష్ట పడి తీసుకొచ్చిన ఆ డ్రెస్ తన దగ్గర ఇంకా పది లంగా ఉంది. ఆయన స్వచ్ఛమైన ప్రేమకు సాక్ష్యంగా, వెలకట్టలేని ఆయన అభిమానానికి తీపి గుర్తుగా.

ఇలాంటి హృదయం కదిలించే సంఘటనలు తన జీవితంలో కోకొల్లలు. పిల్లల పాదాలలో ముళ్లు దిగబ డతాయేమోనని తన అరచేతులాన్ని మరీ పెంచారు అమ్మా, నాన్నలు. వెలుగుతున్న కొవ్వొత్తిలా తమ జీవి తాలని పిల్లల కోసమే త్యాగం చేసిన మహనీయులు తమ అమ్మా, నాన్నలు.

ఇక సెలవుల్లో తాము ఊరికి వస్తున్నామంటే చాలు అంత సంబరపడిపోయేది అమ్మ. కష్టపడి బియ్యం దంచి అరిసెలు చేసేది. ఎవరికిష్టమైన పిండి వంటలు వాళ్లకి వండి పెట్టేది. తాము సాయం వస్తా మన్నా అంగీకరించేది కాదు. "రేపొద్దున అత్తవారింట్లో ఎలాగూ తప్పదు. ఇప్పటి నుంచీ ఎందుకు కష్టపడతా రమ్మా!" అంటూ వారించేది.

పెద్దక్క ఇంజనీరింగ్ ఫైనలియర్‌లో ఉన్నప్పుడు డబ్బుతో బాగా ఇబ్బందిగా ఉంటే తన పెళ్లినాటి మామిడిపిందెల నెక్లెస్‌ను ఏమీ ఆలోచించకుండా అమ్మి తనకు డబ్బు సర్దుబాటు చేసింది అమ్మ. చిన్నక్క పి.హెచ్.డి. చేస్తున్నప్పుడు వర్క్‌కి కావలసిన కెమికల్స్ కొనడానికి తన చేతి గాజులు కరిగించింది అమ్మ. కానీ ఏ రోజూ ఆమె ఆ విషయంగా బాధపడేది కాదు. "నా పిల్లల చదువుకోసమే కదా నేను ఏం చేసినా" అని సర్ది చెప్పుకునేది.

ఇలా ఎన్నో కష్టనష్టాలు పడి ముగ్గురినీ చదివించి ఒక్కొక్కరికీ లక్షల కొద్దీ కట్నాలిచ్చి పెళ్లిళ్లు చేశారు. పెళ్లికి ముందే తనకు మంచి గవర్నమెంట్ జాబ్ వచ్చింది. అదే సంస్థలో పనిచేసే రవీంద్రతో తనకు పెళ్లి జరిపించారు. అమ్మానాన్నలు తమకొచ్చే పెన్ష న్‌లో ఆ పల్లెటూళ్లో ప్రశాంతంగా గడిపేవారు. తమ ఇళ్లకు రమ్మని కూతుళ్లు ఆహ్వానించినా కూడా తమక క్కడే హాయిగా ఉందనీ, ఆ పల్లెటూరిని వదిలి ఎక్కడికీ రాలేమని సున్నితంగానే తిరస్కరించేవాళ్లు. ఇప్పుడు కూడా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తనతో రావ డానికి అంగీకరించారు.

★ ★ ★

గడియారం నాలుగు గంటలు కొట్టడంతో స్వప్న ఈ లోకంలోకొచ్చింది. ఆలోచనల్లో పడి టైమ్ తెలీనే లేదు అనుకుంటూ. అందరికీ టిఫిన్, కాఫీ అందిం చింది. తర్వాత తల్లిదండ్రులనిద్దరినీ ఇంటికి దగ్గరే ఉన్న పార్కులో వదిలి గంట తర్వాత వస్తానని చెప్పి తిరిగి వచ్చింది. భర్త, అత్తగారు ముందు రూమ్‌లోనే కూర్చొని తన నిర్ణయం కోసం ఆత్రంగా ఎదురుచూస్తు న్నారు. ఇల్లంతా విచిత్రమైన నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ నోరు విప్పింది స్వప్న. "నా తల్లిదండ్రులను ఇక్కడే ఉంచుకోవాలనుకుంటు న్నాను. నా నిర్ణయం సరైనదే అని నేననుకుంటు న్నాను. ఏది ఏమైనా నా నిర్ణయం మార్చుకునే ప్రసక్తే లేదు" మెల్లగా అయినా స్థిరంగా పలికింది స్వప్న.

స్తన్నయిపోయారు రవీంద్ర, అతని తల్లి. ఇంత ధైర్యం తనకెలా వచ్చిందో అని ఆశ్చర్యపోయారు. పెళ్లయి ఇన్నేళ్లయినా ఏరోజూ తాము చెప్పిన గంగిరె

ద్దులా తలూపడం తప్ప తిరిగి మాట్లాడేది కూడా కాదు.


నోట మాట రానట్లు నిలబడ్డ భర్త, అత్తగారినుద్దేశించి అంది స్వప్న. "అవునండీ! నవమాసాలు మోసి, జన్మనిచ్చి పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు నేర్పించిన నా తల్లిదండ్రులు దయనీయమైన స్థితిలో నిస్సహాయంగా ఉన్నప్పుడు వారిని చేరదీయడం కూతురిగా నా కనీస బాధ్యత. ఈ విషయంలో నేను ఎటువంటి రాజీకి రాదలుచుకోలేదు. అయిదారేళ్ల బంధం మీదయితే ముప్పై ఏళ్ల బంధం అమ్మానాన్నలకి. తాళి కట్టామనే ఒకే ఒక హక్కుతో నా జీవితాన్ని పూర్తిగా మార్చివేశారు. నాకంటూ వ్యక్తిత్వమే లేకుండా చేశారు మీరు. నాకంటూ ఓ స్వతంత్ర ఆలోచన ఉండకూడదు. మీ మాటలకు ఎదురు తిరిగి ఏమీ చెప్పకూడదు.

మీతో సమానంగా ఉద్యోగం చేస్తున్నా, జీతం సంపాదిస్తున్నా నా ఆలోచనలకు మీరు ఏమాత్రం విలువనివ్వలేకపోయారు. అత్తగారూ! అత్త అంటే అమ్మ తర్వాత అమ్మలాంటిదని అంటారు. కనీసం మీరైనా నా మనసు అర్థం చేసుకోలేకపోయారు. పెళ్లయి ఇన్నేళ్లలో ఏరోజూ నేను మీ మాట జవదాటలేదు. మీరెన్ని మాటలు అన్నా నోరు మెదపకుండా నా తల్లిదండ్రుల కంటే ఎక్కువగా మిమ్మల్ని చూసుకుంటున్నాను. కానీ మీ మనసు కరగలేదు. రవీంద్రగారూ! ఇంతకీ మా అమ్మానాన్నలు చేసిన తప్పేమిటండీ! వివాహ సమయంలో మీ కాళ్లు కడిగి, కన్యాదానం చేసి వరకట్న కానుకలతోపాటు తాము ప్రాణప్రదంగా పెంచుకున్న కూతుళ్లను మీకు అందించడమేనా! మీరన్నట్లు నా అక్కలకు కూడా వారి పట్ల బాధ్యత ఉంది. కానీ అది వారు విస్మరించారు. నేను కూడా వాళ్లలాగే ప్రవర్తిస్తే ఇక మానవత్వం అనే పదానికి అర్థం ఉంటుందా! అందరమూ పక్కకు తప్పుకుంటే ఇక ఆ పెద్దవాళ్లని చూసుకొనేదెవరు? ఆ మాత్రం కూడా మీరు ఆలోచించలేకపోయారు.

జీవితమంతా పిల్లల కోసం, వాళ్ల భవిష్యత్ కోసం కష్టపడి, అలసిపోయిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో పిల్లల ఆసరా చేయూత ఎంతో అవసరం. కొడుకులున్న తల్లిదండ్రులకీ ఆ చేయూతనందుకునే అవకాశం ఉంది. కూతుళ్లు ఉన్న పేరెంట్స్‌కు ఆ అవకాశం లేదు అని మీరు ఎందుకనుకుంటున్నారు? అలా అయితే ఆడపిల్లలు మాత్రమే ఉన్న నా తల్లిదండ్రులలాంటి వారి పరిస్థితి ఏమిటి? వారు ఆడపిల్లలని మమ్మల్ని పెంచకుండా వదిలేశారా? మిమ్మల్ని మీ అమ్మా నాన్నా ఎంత ప్రేమగా చూశారో అంతే ప్రేమగా మా అమ్మానాన్న కూడా మమ్మల్ని పెంచి పెద్ద చేశారు. తమ అనురాగం, ఆప్యాయతా రంగరించి పోసి మమ్మల్ని ఈ స్థితికి తెచ్చారు. అటువంటి నా అమ్మానాన్న ఈ రోజు కద లలేని స్థితిలో ఉండడం కళ్లారా చూసి కూడా వాళ్లని వదిలేసి రమ్మని ఎలా అనగలుగుతున్నారు? మీరే నా పొజిషన్‌లో ఉంటే అలాగే చేస్తారా?

నా మనసులోని సంఘర్షణనూ, నా నిర్ణయాన్ని మీకు తెలియజేశాను. ఇప్పటికైనా మీరు మీ మనసు మార్చుకొని నాతో కలసి జీవించాలనుకుంటే నాకు అభ్యంతరమేమీ లేదు. ఇది నా క్వార్టర్సు. కాబట్టి మీరే బైటికి వెళ్లాలి. మీరు ఇచ్చిన డైవర్స్ అప్లికేషన్స్. నా సంతకం కూడా అందులో అయిపోయింది. నా ఈ జీవన పోరాటంలో చివరి వరకూ, ఆ భగవంతుడు నాకు తోడుగా ఉంటాడని నమ్ముతున్నాను" చెప్పడం ముగించి, తల్లిదండ్రులను తీసుకురావడానికి పార్కువైపు బయలుదేరింది స్వప్న గుండెల నిండా ఆత్మవిశ్వాసంతో.



## గడసరి ఇలియానా

టాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన 'పోకిరి' సినిమాకి కూడా సీక్వెల్ తయారయ్యే అవకాశాలున్నాయని వినిపిస్తోంది. ఇందులో కూడా మహేష్ బాబే హీరోగా నటించవచ్చు. అలాగే హీరోయిన్‌గా ఇలియానా నటిస్తుందా లేదా అనేది అందరి డౌటు. ఆ మాటే ఇలియానా దగ్గర ప్రస్తావిస్తే- 'ఏమో! నా వరకు అయితే ఇంకా అలాంటి ఆఫరేమీ రాలేదు. వచ్చాక, పార్ట్-2 నా పాత్ర ఇంపార్టెన్స్ బట్టి ఆలోచిస్తున్నాను' అంటోంది వయ్యారాల ఇలియానా. ఎంతయినా సినిమాల్లోకొచ్చి నాలుగేళ్లు కావస్తోంది కదా, మాట్లాడ్డంలో చాలా జాగ్రత్తగా వుంటోంది ఇలియానా.